www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 11 ఆగస్టు 2025



ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి : సిపిఎం

ప్రజాశక్తి పులివెందుల టౌన్

పులివెందుల జడ్‌పిటిసి ఉప ఎన్నికలను ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి మనోహర్ ఎన్నికల అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఎన్నికల ప్రచార సమయంలో కొన్ని ఘర్షణల వల్ల ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారని పేర్కొన్నారు. ఎన్నికల ఓటింగ్ రోజు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు నిర్వహించాలన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా చూడాలని కోరారు . ప్రతి ఓటరు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటర్లకు నీళ్లు, రవాణా సౌకర్యాలను కల్పించాలన్నారు.

రూ.కోట్లు కుమ్మరించారు!?

రూ.22 కోట్లకుపైగా పంపిణీ
ఒక్కో ఓటుకు రూ.ఐదు వేలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జడ్‌పిటిసి ఉపఎన్నికల్లో డబ్బుల వరద పారింది. కడప, అన్నమయ్య జిల్లాల పరిధిలోని పులివెందుల, ఒంటిమిట్ట జడ్‌పిటిసి ఉప ఎన్నిక బరిలో నిలిచిన ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు పోటా పోటీగా నగదు పంపిణీ చేయడం విస్మయాన్ని కలిగించింది. పులివెందుల జడ్‌పిటిసి ఉపఎన్నికలో గరిష్టంగా ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓటుకు రూ. ఐదు వేల చొప్పున పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. ఈలెక్కన పులివెందుల జడ్‌పిఇసి పరిధిలోని 10,600 ఓట్లలో 90 శాతం మేరకు పంపిణీ చేసినట్లు సమాచారం. ఈలెక్కన ప్రధాన పార్టీలైన టిడిపి, వైసిపి ఓటుకు రూ.10 వేల చొప్పున పంపిణీ చేసినట్లు అంచనా. ఈలెక్కన సగటున రూ.10 కోట్లు ఖర్చు చేసిన ట్లు తెలుస్తోంది. ఇదేతరహాలో ఒంటిమిట్ట జడ్‌పిటిసి పరిధిలో ప్రధాన పార్టీలకు చెందిన టిడిపి, వైసిపి అభ్యర్థులు ఓటుకు రూ.మూడు వేల నుంచి రూ. నాలుగు వేల వరకు పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. ఈలెక్కన ఇద్దరు నగదు పంపిణీని లెక్కిస్తే ఓటుకు రూ.ఏడు వేలు చొప్పున ఖర్చు చేయడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఈలెక్కన 26 వేల మందిలో 90 శాతం మందికి 19 వేల నుంచి 20 వేల మందికి రూ.12 కోట్ల నుంచి రూ.14 కోట్ల వరకు పంపిణీ చేసి నట్లు తెలుస్తోంది. దీనికి మద్యం ఖర్చు అదనమని గ్రహించాలి. ఇదిలాఉండగా జడ్పీటిసి ఉపఎన్నిక ఎనలేని రాజకీయ ప్రాధా న్యత సంతరించుకున్న నేపథ్యంలో ఉప ఎన్నికల ప్రచారంలో ఎదు రైన చేదు అనుభవాల నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పా ట్లు చేశారు. ఉమ్మడి జిల్లాలోని ఉపఎన్నికల పరిధిలో పులివెందుల జడ్పీటిసి ఉపఎన్నిక ప్రాంతానికి 650 మంది, ఒంటిమిట్ట జడ్పీటిసి ప్రాంతానికి 700 మంది చొప్పున రెండు జడ్పీటిసిల పరిధిలో 1,3 50 మంది పోలీసుల పర్యవేక్షణలో ఉపఎన్నికలను ప్రశాంత వాతా వరణంలో నిర్వహించడానికి అవసరమైన కసరత్తు చేస్తుండడం గమనార్హం.

ష్..గప్-చిప్..!

ముగిసిన ఎన్నికల ప్రచారం
ఎత్తుకు పైఎత్తుల్లో అభ్యర్థులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో జడ్‌పిటిసి ఉప ఎన్నికల ప్రచారం ముగిసింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆదివారం సాయంత్రం నుంచి రాజకీయ పార్టీల రథాల మైకులు మూగపోయాయి. ఈనేపథ్యంలో కడప, అన్నమయ్య జిల్లాల అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా కడప జిల్లాలోని పులి వెందుల, అన్నమయ్య జిల్లాలోని ఒంటిమిట్ట జడ్‌పిటిసి ఉపఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు విజ యావకాశాలపై సీరియస్‌గా దృష్టి సారించారు. ఎలాగైనా గెలవాలనే లక్ష్యంగా మంత్రాంగం నడుపుతు న్నారు. ఇప్పటివరకు నిర్వహించిన ఎన్నికల ప్రచారం ఒక ఎత్తు కాగా, ప్రచారం ముగిసిన దగ్గర నుంచి పోలింగ్ రోజున ఓటింగ్ పో లరైజేషన్ చేయడంపై రాజకీయ నాయకత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఉపఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు బలాబలా లను కూడగట్టుకునే పనిలో మరోసారి నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా తమ బంధు, మిత్ర, కళత్ర వర్గాలు ఏగ్రామాల్లో ఉన్నారు. వారి అవసరాలేమిటి, వారిలో ఎవరిని ఎలా లోబరుచుకోవాలనే ప్రయోగాలు చేయడంపై దృష్టి సారించారు. బంధు, మిత్ర ప్రయో గాల ద్వారా, సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రలోభాలకు గురి చేయడం ద్వారా ఓటింగ్ పెంచుకోవడంపై దృష్టి సారించారు. దీంతో పాటు ఎన్నికల్లో ఎలా గెలవాలనే అంశంపై సీరియస్‌గా దృష్టి సారిం చారు. వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల్లో ఎలాగైనా గెలిచి రాజ కీయంగా పైచేయి సాధించాలనే ఉద్దేశంతో కసరత్తు చేస్తున్నారు. ఇందుకుగానూ రాష్ట్రంలోని నలుమూలల నుంచి అమాత్యులు మొదలుకుని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర రంగాలకు చెందిన ప్రజాప్రతినిధుల వరకు ముమ్మరంగా కసరత్తు చేస్తుండడం విస్మయాన్ని కలిగిస్తోంది.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

జడ్‌పిటిసి ఉప ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి
విలేకర్ల సమావేశంలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో ఈ నెల 12న నిర్వహించబోయే పులివెందుల, ఒంటిమిట్ట జడ్‌పిటిసి ఎన్నికల పోలింగ్ ప్రక్రియను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లోని విసి హాల్లో పులివెందుల, ఒంటిమిట్ట జడ్‌పిటిసి ఉప ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఎస్‌పి అశోక్ కుమార్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పులివెందుల, ఒంటిమిట్ట ఉప ఎన్నికలను పకడ్బందీగా, కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 12న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బ్యాలెట్ బాక్స్‌ల ద్వారా పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే పోలింగ్ సిబ్బందికి మొదటి విడత రాండమైజేషన్ పూర్తి చేసి రెండు శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి మెటీరియల్‌ను పోలింగ్ కేంద్రాలకు పంపించామని తెలిపారు. ఆదివారం సాయంత్రంతో ఉప ఎన్నికల ప్రచార సమయం ముగుస్తుందని, తరువాత అభ్యర్థులు, పార్టీలు, ప్రతినిధులు, ఎటువంటి ప్రచారం నిర్వహించడం నిషేధమన్నారు. స్థానికేతరులు క్యాంపియన్‌లో పాల్గొన్నవారు ఆయా ప్రాంతాల నుంచి బయటికి వెళ్లాలన్నారు. లేనిపక్షంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఓటర్లకు పులివెందుల 95 శాతం, ఒంటిమిట్టలో 96 శాతం పోలింగ్ స్టేషన్ల వివరాలతో కూడిన ఓటర్ స్లిప్పులను పంపిణీ చేశామని చెప్పారు. గతంలో ఎన్నికల సమయంలో లా అండ్ ఆర్డర్ సమస్యలు, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పులివెందులలో 15 క్రిటికల్ పోలీస్ స్టేషన్లను, ఒంటిమిట్టలో 10 క్రిటికల్ పోలీస్ స్టేషన్లను గుర్తించామని పేర్కొన్నారు. అక్కడ సిసి కెమెరాల పర్యవేక్షణ, వెబ్ కాస్టింగ్ ఉంటుందని తెలిపారు. వెబ్ కాస్టింగ్ లేని పోలింగ్ స్టేషన్ వద్ద మైక్రో అబ్జర్వర్‌ను నియమించామని చెప్పారు. అలాగే ఉప ఎన్నికలకు సంబంధించి పోలింగ్ స్టేషన్ వద్ద తాగునీరు, మెడికల్ ఎమర్జెన్సీ వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ రోజు పవర్, క్యూలైన్ మేనేజ్మెంట్ వంటివి పూర్తి స్థాయిలో సిద్ధం చేశామన్నారు. ఈనెల 11న ఉదయం పులివెందుల, ఒంటిమిట్టకు పోలింగ్ మెటీరియల్‌ను అందజేస్తామన్నారు. ఈనెల 14న స్థానిక మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ యూని వర్సిటీలో కౌంటింగ్ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి అధికారులకు విధులు కేటాయించామని తెలిపారు. ఎస్‌పి అశోక్‌కుమార్ మాట్లాడుతూ జడ్‌పిటిసి ఉప ఎన్నికలకు సంబంధించి పది రోజులుగా కసరత్తులు ప్రార ంభించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు చోటు లేకుండా సమస్యాత్మక ప్రాంతాలలో ఆర్మ్‌డ్ ఫోర్స్‌ను నియమించామని చెప్పారు. రూట్ పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసుకుని స్టాటిస్టికల్ సర్వే లైన్స్‌తో కట్టుదిట్టమైన, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. జిల్లాలోని మొత్తం 13 చెక్ పోస్ట్‌ల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామని తెలిపారు. పులివెందుల, ఒంటి మిట్ట నియోజకవర్గ పరిధిలోని ఎంట్రీ పాయింట్లు వద్ద కట్టుదిడ్డమైన భద్రత ఏర్పాట్లు చేశామని చెప్పారు. చెదురుమదురు సంఘటనలు జరగకుండా వజ్రా వెహికల్స్, మొబైల్ కెమెరా వెహికల్స్, నేత్ర వంటి అత్యాధునిక వ్యవస్థలతో గస్తీ కాస్తున్నామన్నారు. పులివెందుల, ఒంటిమిట్ట ప్రాంతాలలో రెండు డ్రోన్లతో గస్తీ నిర్వహిస్తున్నామన్నారు. సమస్యాత్మక ప్రాంతాలలో అన్ని రకాల భద్రత చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. గ్రామాలను క్లస్టర్లుగా ఏర్పాటు చేసి మూడు గ్రామాలను పరిధిలో పోలీస్ ఇన్స్పెక్టర్, పదిమంది కానిస్టేబుల్ తో భద్రత ఏర్పాటు చేశామని తెలిపారు. రాత్రి సమయాల్లో కూడా బందోబస్తు నిర్వహించామని చెప్పారు. సమావేశంలో జడ్‌పి సిఇఒ ఓబులమ్మ పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు

- కర్నూల్ రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహిస్తామని, పది పోలింగ్ కేంద్రంలో ఒక సిఐ స్థాయి అధికారిని నియమించడం నియమించామని స్వేచ్ఛాయుత వాతావరణంలో పోలింగ్ జరిగేలా భద్రతా చర్యలు చేపట్టామని కర్నూల్ రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ జడ్‌పిటిసి ఉపఎన్నిక సంబంధించి 12న జరిగే పోలింగ్‌కు భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. మొత్తం ఆరు గ్రామ పంచాయతీలకు సంబంధించి 9 ప్రదేశాల్లో 15 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. మొత్తం కేంద్రాలను మూడు రూట్లగా కేటాయించామని ప్రతి రూటుకు ఒక్కొక్క డిఎస్‌పి స్థాయి అధికారి పర్యవేక్షిస్తారని చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద సిఐతో పాటు 700 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారని ఆయన తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద అసాంఘిక కార్య కలపాలకు ,దౌర్జన్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ప్రతి ఓటరూ ప్రశాంత వాతావరణంలో వారి ఓటును వినియోగించుకునేలా పరుస్థితులు కల్పిస్తామన్నారు.

శాంతియుత ఎన్నికలకు సహకరించాలి : డిఎస్‌పి

పులివెందుల జడ్‌పిటిసి ఉప ఎన్నికల ప్రశాంతంగా శాంతియుతంగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పులివెందుల డిఎస్‌పి మురళీ నాయక్ ఒక ప్రకటనలో కోరారు. ప్రచారం ఆదివారం సాయంత్రం ముగిసినందున, పులివెందుల జడ్‌పిటిసి ఉప ఎన్నికల అభ్యర్థులు ఎవరూ ఎలాంటి రూపంలోనైనా ఎన్నికల ప్రచారం చేయరాదని తెలిపారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి ప్రచార కార్యక్రమాలు నిర్వహించిన పక్షంలో, సంబంధిత అభ్యర్థులు, సహకరించిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారని చెప్పారు. తనిఖీల్లో ఏవైనా అనుమానాస్పద వస్తువులు లేదా పదార్థాలు కనబడినా వెంటనే పులివెందుల పోలీసులకు తక్షణమే సమాచారం ఇవాలన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు

ప్రజాశక్తి కడప అర్బన్ : పులివెందుల జడ్‌పిఇసి ఉప ఎన్నికల నేపథ్యంలో పోలీసులు 6 చెక్ పోస్టులతో పాటు 3 బార్డర్ చెక్ పోస్ట్‌ల వద్ద వాహనాలను అణువ ణునా క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎస్‌పి. ఇ.జి. అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు, సిబ్బంది విస్తృతంగా వాహనాల తనిఖీలు చేస్తున్నారు. అద్దాలమర్రి బార్డర్ చెక్ పోస్ట్, అంబకపల్లి బార్డర్ చెక్ పోస్ట్, పార్నపల్లి బార్డర్ చెక్ పోస్ట్‌తో పాటు కణంపల్లి చెక్ పోస్ట్, నలగొండు వారి పల్లి, రాయలాపురం, చందమామ దాబా, అలవలపాడు రోడ్ సర్కిల్, ఎర్రిపల్లి చెక్ పోస్ట్ వద్ద పోలీస్ అధికారులు, సిబ్బంది వాహనాలను అణువణువూ క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తర్వాతే అనుమతిస్తున్నారు. పెద్దమొత్తంలో నగదు, బంగారు లేదా ఇతర విలువైన వస్తువులు, మద్యం, ఓటర్లను ప్రలోభ పెట్టే వస్తువుల తరలింపుపై పూర్తి స్థాయిలో నిఘా ఉంచారు.

దాడులు చేసి మాపైనే కేసులా?

- ఎంపీ వై.ఎస్.అవినాష్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

జడ్‌పిటిసి ఉప ఎన్నికల్లో టిడిపి నాయకులు తమపై దాడులు చేసి కేసులు పెడుతున్నారని, ప్రజాబలం లేకే టిడిపి అరాచకాలు, దౌర్జన్యాలు చేస్తున్నాయని, పైగా తమపై తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేస్తున్నారని కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా టిడిపి నాయకులు ప్రత్యేక అల్లరి మూకలను ఏర్పాటు చేసి దాడులు చేసిందని పేర్కొన్నారు వారిపై కేసులు ఉన్నా పోలీసులు మాత్రం అరెస్టు చేయలేదన్నారు. వైసిపి నాయకులపై ఎస్‌సి, ఎస్‌టి హత్యాయత్నం వంటి కేసులు పెట్టి ముఖ్య నాయకులను అరెస్ట్ చేస్తున్నారన్నారు. సూపర్‌సిక్స్ వంటి సంక్షేమ పథకాలు అమలు చేసి ఉంటే అరాచకాలు ఎందుకు చేయాలని ప్రశ్నించారు. అరటి స్టోరేజ్ యూనిట్‌ను వినియోగంలోనికి తేలేకపోయారన్నారు. మెడికల్ కళాశాల సీట్లు వస్తే వద్దని వెనక్కి పంపింది కూటమి ప్రభుత్వం కాదా అని ఆయన ప్రశ్నించారు. ప్రశాంతంగా, పచ్చగా ఉండే పులివెందులలో అరాచకాలు సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా అధికార యంత్రాంగం చూడాలన్నారు. ఇవన్నీ ప్రజలు గమనించి అభివృద్ధి చేసిన వారికి ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శివప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

అహంకారం వీడని వైసిపి నాయకులు

- మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వైసిపి అధికారం కోల్పోయినా అహంకార చర్యలు మానుకోలేదని వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే దళితులపైన, గిరిజనుపైన దాడులు హత్యలు పెరిగాయని పులివెందుల పులకేశి సతీశ్ రెడ్డి అని మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు అన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తిరుపతిలో భూమన కరుణాకర్ రెడ్డి నివాసంలో ఆయన కుమారుడు అభినయ్ రెడ్డి ఆధ్వర్యంలో అనిల్ రెడ్డి, దినేష్ రెడ్డి అనే వ్యక్తులు పవన్ అనే దళితున్ని కిడ్నాప్ చేసి బంధించి, హింసించి, వీడియో చిత్రీకరించి తండ్రికి పంపలేదా అని ప్రశ్నించారు. జగన్ అధికారంలో ఉండగా వైసిపి ఎమ్మెల్సీ డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేసి పార్సిల్ చేశారని, ఫిర్యాదు ఇస్తే రెండో కొడుకును కూడా చంపుతామని బెదిరించారని అన్నారు.

మోస్ట్ వాటెండ్ ఎర్రచందనం

స్మగ్లర్ నాగదస్తగిరిరెడ్డి అరెస్టు

- అదుపులో మరో ఐదుగురు
- 52 ఎర్రచందనం దుంగలు, 2 కార్లు, ద్విచక్రవాహనం స్వాధీనం
- మీడియాకు వెల్లడించిన ఎస్‌పి ఇ.జి. అశోక్‌కుమార్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి ఇ.జి.అశోక్‌కుమార్

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో లంక మల్ల అటవీ ప్రాంతంలో ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తున్న మోస్ట్‌వాటెండ్ ఎర్రచందనం స్మగ్లర్ నాగ దస్తగిరిరెడ్డిని ఆకస్మికంగా దాడులు నిర్వహించి పోలీసులు అరెస్టు చేశారు. అతనితోపాటు మరో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సుమారు టన్ను బరువు ఉన్న 52 ఎర్రచందన దొంగలను, రెండు కార్లు, ద్విచక్రవానం స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్‌పి ఇ.జి. అశోక్ కుమార్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం చాపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు, టాస్క్ ఫోర్స్ సిబ్బంది కలిసి వాహనాలు తనిఖీ చేస్తూండగా కారులో ఎర్రచందనం దుంగలను గమనించి వాటిని స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు. స్మగ్లర్లు ఇరగంరెడ్డి నాగ దస్తగిరిరెడ్డి, ముదిరెడ్డి రామమోహన్ రెడ్డి, ఉమ్మనబోయిన కృష్ణయ్య, కాయలి శ్రీనివాసులు, బండ్రెడ్డి ఓబుల్ రెడ్డి, శనివారపు బాల గంగిరెడ్డిని అరెస్టు చేశారని తెలిపారు. ఇరగంరెడ్డి నాగ దస్తగిరిరెడ్డి గతంలో మోస్ట్ వాంటెడ్ ఎర్రచందనం స్మగ్లర్ అని చెప్పారు. సుమారు 86 ఎర్రచందనం కేసులు, 34 దొంగతనాల కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. మూడుసార్లు పీడీ యాక్ట్ నమోదు చేశారని తెలిపారు. ఇతని భార్య లాలుబి పై కూడా ఎర్రచందనం కేసులు ఉన్నాయని చెప్పారు. ఈమె ప్రస్తుతం జైలులో ఉన్నారని పేర్కొన్నారు. ఇతని కుటుంబ సభ్యులు లులూ బాషా, పక్రుద్దీన్, జాకీర్ పేరు మోసిన ఎర్రచందనం స్మగ్లర్లని తెలిపారు. వీరిపై వందల కేసులు, అనేకమార్లు పీడీ యాక్ట్‌లు ఉన్నట్లు చెప్పారు. పాలకొండలు, లంక మల్ల అటవీ ప్రాంతం నుంచి ఎర్రచందనం దొంగలను నరికి ఇతర రాష్ట్రాలకు అక్రమ రవాణా చేస్తూ ఉంటారని పేర్కొన్నారు. ఇతని అనుచరులు కూడా ఇందులో భాగస్వాములను తెలిపారు. ఢిల్లీలో ఉండే సలీం ప్రధాన స్మగ్లర్‌కు హవాలా వ్యాపారి ద్వారా హైదరాబాదులో ఉండే విక్రమ్‌సింగ్ సోలంకి అనే అతని ద్వారా డబ్బులను హవాలా రూపంలో నాగ దస్తగిరి రెడ్డికి అందజేసేవారని చెప్పారు. విక్రమ్ సింగ్ సోలంకిని వారం రోజుల కిందట అరెస్టు చేశామని పేర్కొన్నారు. స్మగ్లర్లను అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన టాస్క్‌ఫోర్సు సిఐ శంకర్‌రెడ్డి, సిబ్బంది, మైదుకూరు రూరల్ సిఐ శివశంకర్, వారి టీం సభ్యులు, చాపాడు ఎస్ఐ చిన్న పెద్దయ్య, వారి సిబ్బందిని అభినందించారు. ఎర్రచందనం చెట్లను నరికినా, అమ్మినా, కొన్నా, దాచి ఉంచినా, అక్రమ రవాణా చేసినా, ఏ విధంగా సహకరించినా అట్టి వారిపై నాన్ బయిలబుల్ కేసు పెట్టి, హిస్టరీ సీట్ తెరుస్తామని హెచ్చరించారు. పదపదే ఇలాంటి నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్ అమలు చేస్తామని స్పష్టం చేశారు. అక్రమ కార్యకలాపాల సమాచారం తెలిస్తే ప్రజలు పోలీసు శాఖ దృష్టికి తీసుకురావాలని కోరారు. వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

పెన్నానదిలో చిక్కుకున్న యాత్రికులు

- రక్షించిన పోలీసు, అగ్నిమాపక సిబ్బంది
- అందరూ సురక్షితం



యాత్రికులను కాపాడిన పోలీస్, అగ్నిమాపక సిబ్బంది

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్

పెన్నానదిలో చిక్కుకున్న ముగ్గురు యాత్రికులు చిక్కుకున్నారు. వారిని పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. వివరాలు.. వైఎస్ఆర్ కడప జిల్లా ప్రొద్దుటూరు రాజరాజేశ్వరి అపార్ట్‌మెంటుకు చెందిన గోవర్ధన్ రెడ్డి, రామలక్ష్మమ్మ, ఓబులమ్మ పౌర్ణమి సందర్భంగా ఆదివారం తెల్లవారుజామున 3 గంటల సున్నపురాళ్లపల్లె మీదుగా జమ్మలమడుగు మండల పరిధిలోని కన్నెతీర్థంకు కారులో బయలుదేరారు. భారీ వర్షాల నేపథ్యంలో శనివారం వైఎస్ఆర్ కడప జిల్లా మైలవరం జలాశయం నుంచి పెన్నా నదికి నీటిని విడుదల చేశారు. నీటి ప్రవాహం ఉధృతంగా ఉండటంతో జమ్మలమడుగు మండలం దానవులపాడు - సున్నపురాళ్లపల్లె మధ్య పెన్నా నదిపై వేసిన రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు నది మధ్యలో చిక్కుకుపోయారు. విషయం తెలుసుకన్న జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేశ్ సుబ్బరామిరెడ్డి పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది హుటాహుటీనా సంఘటనా స్థలానికి చేరుకుని నదిలో చిక్కుకున్న ముగ్గురిని తెప్పల సాయంతో వారిని రక్షించారు. తమను రక్షించిన పోలీసులకు అగ్నిమాపక సిబ్బందికి టిడిపి ఇన్‌ఛార్జి భూపేశ్‌రెడ్డి కృతజ్ఞతలు యాత్రికులు తెలియజేశారు.

వైసిపి దగ్గర నోట్లు గుంజండి.. సైకిల్‌కి ఓటెయ్యండి

- ప్రభుత్వ విప్ ఆదినారాయణరెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

దౌర్జన్యాలకు అరాచకాలకు పేరు పెట్టి వైసిపి కుటుంబందే అని , ఉప ఎన్నికలను బాయ్ కట్ చేసేందుకే వైసిపి సాకులు వెతుకుతోందని, వైసిపి దగ్గర నోట్లు గుంజి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని ప్రభుత్వ విప్ ఆదినారాయణ రెడ్డి అన్నారు. పట్టణంలోని స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేంలో ఆయన మాట్లాడుతూ ఎపిలో జగన్ రూ. 10 లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని నిండా ముంచారని చెప్పారు. చంద్రబాబు నాయుడు మళ్లీ రాష్ట్రాన్ని ఆదాయపు రాష్ట్రంగా మారుస్తున్నారన్నారు. గతంలో పులివెందులలో జరిగిన ఎన్నికల్లో నామినేషన్ వేసే పరిస్థితి లేదని దౌర్జన్యాలు చేస్తూ అరాచకాలు చేసి ప్రత్యర్థి లేకుండా ఏకగ్రీవం చేసుకున్నారని చెప్పారు. రౌడీయిజం, దౌర్జన్యం వైసిపికే దక్కుతుందని చెప్పారు. టిడిపి కవలం అభివృద్ధి ఒక్కటే మంత్రంగా ముందుకు సాగుతుందన్నారు. ఈ ప్రాంతంలో పాడా పేరుతో సొమ్ము నంతటిని జేబులో నింపుకోవడానికి సరిపోయిందని చీని, అరటి చివరకు చికెన్‌లో కూడా కమిషన్లు తీసుకుంటూ ఈ ప్రాంత ప్రజలను మోసం చేశారన్నారు. ఎన్నికల కోడ్ అనంతరం ఆర్ తుమ్మలపల్లిలో శ్మశాన వాటికను ఎ ఏర్పాటు చేస్తామన్నారు. పులివెందుల ఒంటిమిట్ట రెండు స్థానాలను తెలుగుదేశం పార్టీ కైవసం చేస్తుందని, సూపర్ సిక్స్ పథకాలే విజయ్ తీరాలకు చేరుస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి మంత్రి సవిత, మాజీ ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డిపాల్గొన్నారు.

జిల్లా స్కౌట్ రోవర్‌కు 'నేషనల్ లీడర్' పురస్కారం

ప్రజాశక్తి - కడప అర్బన్

వైఎస్ఆర్ కడప జిల్లా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు చెందిన స్కౌట్ రోవర్ సగినాల అహమ్మద్ 'నేషనల్ కంటింజెంట్ లీడర్ అవార్డు' సాధించారు. ఈనెల 5 నుంచి 9 వరకు తమిళనాడు రాష్ట్రంలోని పెరంబూరు (సదరన్ రైల్వే)లో నిర్వహించిన నేషనల్ రోవర్/ రేంజర్ కార్నివాల్ నిర్వహించారు. ఈ కార్నివాల్ కు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన రేంజర్లు, రోవర్లు హాజరు కాగా ఆంధ్రప్రదేశ్ నుంచి వైఎస్ఆర్ కడప జిల్లా పులివెందులకు చెందిన సగినాల అహమ్మద్ పాల్గొని వివిధ అంశాల్లో చక్కటి ప్రతిభ కనబరచటంతో పాటు ఓవరాల్‌గా 'స్టేట్ బెస్ట్ కంటింజెంట్ లీడర్' అవార్డుకు ఎంపికయ్యాడు. జిల్లాకు చెందిన స్కౌట్ జాతీయస్థాయిలో కంటింజెంట్ లీడర్ అవార్డును అందుకోవడం జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.



పురస్కారం అందుకుంటున్న స్కౌట్ రోవర్ అహ్మద్

స్మార్ట్ మీటర్లకు కెపాసిటర్లు తప్పనిసరి

ఆర్‌డిఎస్‌ఎస్ స్కీము పనులు వేగవంతం
ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్.రమణ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి



ముఖా ముఖి..

స్మార్ట్‌మీటర్ల వినియోగదారులు కెపాసిటర్లను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి. జిల్లాలోని వాణిజ్య, ప్రభుత్వ కార్యాలయాలకు మాత్రమే స్మార్ట్‌మీటర్లు బిగించారు. దీంతోపాటు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడంపై దృష్టి సారించాం. ఇందుకుగానూ ఆర్‌డి ఎస్ఎస్ స్కీము పనులను వేగవంతం చేశాం ఏడాది చివరి నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నాం. సూర్య ఘర్ స్కీమ్ ద్వారా అర్బన్ ప్రాంతాల్లోని ఎస్‌సి, ఎస్‌టి గృహాలకు సబ్సిడీతో కూడిన విద్యుత్ సదుపాయాన్ని అందిస్తున్నాం. దీంతోపాటు డిజిటల్ పేమెంట్స్‌ను ప్రోత్సహించామని, ఫలితంగా బకాయిల భారాన్ని తగ్గించడానికి పాటుపడుతున్నామని పేర్కొంటున్న ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్.రమణతో ముఖాముఖి...

విద్యుత్ సర్వీసుల వివరాలు తెలపండి?

జిల్లాలో 8,97,853 విద్యుత్ కనెక్షన్లున్నాయి. ఇందులో 6,76,940 గృహ కనెక్షన్లు, 1,19,000 వ్యవసాయ కనెక్షన్లు, 585 హెచ్‌టి కనెక్షన్లు, 5,330 ఇండస్ట్రియల్ కనెక్షన్లు, 12,332 కుటీర పరిశ్రమల కనెక్షన్లున్నాయి.

ట్రాన్స్‌ఫార్మర్ల లభ్యత ఎలా ఉంది?

జిల్లాలో 2,404 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడమైంది. మరో 132 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తే వ్యవసాయ కనెక్షన్లు పూర్తి స్థాయిలో అందించనట్లు అవుతుంది. దీంతోపాటు 1000 కిలోమీటర్ల కండెక్టర్ కొరత ఉంది. ఇప్పటివరకు 2000 కిలోమీటర్ల మేర కండెక్టర్‌ను ఇవ్వడమైంది. మరో నెల రోజుల వ్యవధిలో పూర్తి స్థాయిలో కండెక్టర్ ఏర్పాటు చేయడంపై దృష్టి సారించాం.

ఆర్‌డిఎస్‌ఎస్ స్కీము పురోగతి ఎలా ఉంది?

ఆర్‌డిఎస్‌ఎస్ స్కీము పనులు ఊపందుకున్నాయి. దేశంలోని యుపి, బీహార్ రాష్ట్రాలకు చెందిన లేబర్ అందుబాటులోకి వచ్చింది. ఫలితంగా కాంట్రాక్టర్ ఆర్‌డిఎస్‌ఎస్ స్కీమ్ పనులను వేగవంతమైంది. జిల్లాలోని 393 ఫీడర్స్‌కు 130 ఫీడర్స్ పూర్తి చేయడమైంది. మరో 129 ఫీడర్స్ పురోగతిలో ఉన్నాయి.

సూర్యఘర్ స్కీమ్ అమలును వివరించండి?

సూర్యఘర్ స్కీమ్ కింద ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచితంగా అమలు చేస్తున్నాం. సుమారు రెండు కిలోవాట్ల మేరకు ఉచితంగా వర్తింప జేస్తాం. ఇప్పటికే 67,374 దరఖాస్తులు స్వీకరించడమైంది. ఇందులో 6,3475 దరఖాస్తులు రిజిస్ట్రేషన్ చేయడమైంది. ఇందులో 840 మంది లబ్ధిదారులకు సూర్య ఘర్ ఫలకలను అమర్చడమైంది.

స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు గురించి తెలపండి?

రాష్ట్రంలో నాలుగో స్థానంలో ఉన్నాం. 2026 ఏప్రిల్ స్మార్ట్ మీటర్ల ద్వారా బిల్లులు వసూలు చేయడం జరుగుతుంది. జిల్లాలో ఇప్పటికి వాణిజ్య, ప్రభుత్వ కార్యాలయాలు, 500 యూనిట్లు వినియోగం కలిగిని గృహాలకు స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేయడమైంది.

ట్రాన్స్‌కో ఆదాయం వివరాలు తెలపండి?

ప్రతినెలా ట్రాన్స్‌కో డిపార్టుమెంట్‌కు రూ.170 కోట్ల ఆదాయం సమకూరుతోంది. ఇందులో హెటి వినియోగదారుల నుంచి రూ.95 కోట్లు, ఎల్‌టి వినియోగదారుల నుంచి రూ.80 కోట్లు ఆదాయం సమకూరుతోంది.

ఉల్లి సాగుపైనే రైతుల ఆశలు

పులివెందుల నియోజకవర్గంలో 4వేల ఎకరాల్లో సాగు-ఏడాదికేడాది పెరుగుతున్న పెట్టుబడులు- ధరలపై రైతుల్లో ఆందోళన



సాగులో ఉన్న ఉల్లిపంట

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఈ ఏడాది ఉల్లి పంట ఆశాజనకంగా కనబడుతోంది. ఆ పంటపై రైతులు ఆశలు పెట్టుకుని ఉన్నారు. ఉద్యాన పంటలలో అతి సున్నితమైన పంట ఉల్లి. ఉల్లికి తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుంది. అంతేకాక సాగుకు పెట్టుబడి కూడా ఎక్కువే. ధరలు ఉంటే ఆదాయం ఉంటుందనే ఉద్దేశ్యంతో రైతులు సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ పంట సాగు చేశాక జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా సకాలంలో తెగుళ్లను నివారించవచ్చు. పంట సాగు చేశాక నిర్లక్ష్యం చేస్తే సాగులో దిగుబడులు చేతికి రావు. ఒకసారి పంట తెగుళ్లతో దెబ్బతింటే తేరుకోవడం కష్టం. దీంతోనే రైతులు ఉల్లి పంటను జాగ్రత్తగా కాపాడు కుంటున్నారు. ప్రతి ఏడాది ఒకే రకమైన పంటలు వేయడం ద్వారా సాగులో దిగుబడులు తగ్గిపోయి నష్టాలు వస్తున్నాయి. ఈనేపథ్యంలో రైతులు పంట మార్పిడితో ఉల్లి పంట సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఉల్లి సాగు విస్తీర్ణం ప్రతి ఏడాది ఎంతోకొంత పెరుగుతూనే ఉంది.

నియోజకవర్గంలో 4వేల ఎకరాలకుపైనే సాగు..

ఈ ఏడాది పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా ఉల్లి సాగు విస్తీర్ణం పెరిగింది. పులివెందుల నియోజకవర్గంలో 4వేల ఎకరాలకుపైనే ఉల్లి సాగైనట్లు ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది దాదాపు 1000 ఎకరాలకుపైనే సాగు విస్తీర్ణం పెరిగిందని చెప్పవచ్చు. నియోజకవర్గంలోని వేముల, వేంపల్లె, తొండూరు మండలాల్లో ఎక్కువ విస్తీర్ణంలోనూ, పులివెందుల, లింగాల, సింహాద్రిపురం మండలాల్లో అక్కడక్కడ రైతులు ఉల్లి సాగు చేసుకున్నారు. వ్యవసాయ బావులు, బోర్ల కింద ఉల్లి పంటల రైతులు సాగు చేసుకున్నారు. సాగులో పెరుగుతున్న పెట్టుబడులు ఉల్లి సాగులో ఏడాదికేడాది పెట్టుబడులు పెరుగుతున్నాయి. సాధారణంగా ప్రతి ఏడాది ఉల్లి విత్తనాలు శేరు రూ.600 ఉంటే ఈ ఏడాది శేరు ఉల్లి విత్తనాలు రూ.1,900కు పెరిగిపోయాయి. ఉల్లి సాగులో ఎకరాకు దిగుబడి సమయానికి రూ.50వేలుకుపైగానే పెట్టుబడులు అవుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. ఉల్లి విత్తనాలు మొలకెత్తినప్పటి నుంచి దిగుబడులు అందేవరకు తోటలలో కలుపు తీయాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఉల్లి సాగులో పనులకు కూలీ కూడా ఎక్కువగానే ఉంటోంది. పంట కాలం పూర్తయ్యాక ఉల్లి గడ్డలు పీకి వేయడానికి, కోత కోయడానికి ఆదనంగా మరో రూ.20వేల వరకు ఖర్చులు అవుతాయని రైతులు చెబుతున్నారు.

120 రోజులకే దిగుబడులు..

ఉల్లి సాగులో దిగుబడులు 120 రోజులకు అందుతాయి. ఈ ఏడాది రైతులు జూన్ మాసంలో ఉల్లి సాగు చేశారు. ఉల్లి పంట సాగు చేసిన 12 రోజులకు మొలకెత్తుతుంది. ఉల్లి విత్తనాలను కర్నూలు జిల్లా నుంచి తెచ్చుకుని రైతులు సాగు చేస్తున్నారు. ప్రతి నాలుగు రోజులకోసారి నీటితడులు ఇవ్వడం.. వారానికోసారి పంటలో కలుపు తీసే పనులు చేపడతారు. అంతే కాక వారానికోసారి తెగుళ్లు సోకకుండా మందులను పిచికారి చేస్తారు. వర్షాలు ఎక్కువగా కురిసిన పంట దెబ్బతినే ప్రమాదం ఉండడంతో వర్షపు నీరు పంటలో నిల్వ లేకుండా చూసుకుంటున్నారు.

కలుపు పడకుండా జాగ్రత్తలు..

ఫ్లుక్లోరాలిన్ 45 శాతం ఎకరానికి ఒక లీటరు చొప్పున పిచికారి చేసి భూమిలో కలియదున్నాలి. లేదా పెండిమిథాలిన్ 30 శాతం ఎకరానికి 1.3 నుండి 1.6 లీ.లేదా ఆక్సీఫ్లోరోఫిన్ 23.5 శాతం 200మి.లీ.చొప్పున నాటే ముందు పిచికారీ చేయాలి. నాటిన 30నుంచి45 రోజుల మధ్య కలుపు తీయాలి.

మార్కెట్ ధరలు స్థిరంగా ఉండాలి..

ఉల్లిసాగు పెట్టుబడులతో కూడుకున్నదే అయినా.. ఆదాయం ఉంటుందనే సాగు చేస్తున్నాం. ఉల్లి సాగులో ఆదాయాన్ని శాసించేది ధరలే. మార్కెట్లో ధరలు స్థిరంగా ఉండాలి. ఉల్లి సాగులో దిగుబడులు వచ్చినా ధరలు లేకపోతే నష్టాలే. ఉల్లి పంటను వేలకు వేలు పెట్టుబడులతో సాగు చేస్తున్నాం. ధరలు లేకపోతే తీవ్రంగా నష్టపోతాం.

- ఉత్తమ్మ, ఉల్లి రైతు, నారేపల్లి, వేముల మండలం

ధర ఉంటేనే ఉల్లి రైతులకు ఆదాయం..

ఉల్లి సాగులో దిగుబడులు వచ్చినా ధరలు లేకపోతే నష్టాలే. అందుకే ఉల్లి సాగులో ఆదాయం రావాలంటే ధరలు ఉండాలి. ఎకరాకు వంద క్వింటాళ్ల దిగుబడి వచ్చినా ధరలు లేకపోతే పెట్టుబడులు కూడా రావు. అదే ఎకరాకు 80 క్వింటాళ్ల దిగుబడులు వచ్చి ధర క్వింటా రూ.2 వేలకుపైనే ఉన్నట్లయితే పెట్టుబడులు కూడా పోనూ.. ఆదాయం ఉంటుంది.

- గంగిరెడ్డి, రైతు, పులివెందుల

మూడు ఎకరాల్లో ఉల్లి సాగు చేశా..

నాకున్న మూడు ఎకరాల్లో ఉల్లి సాగు చేశా. పంట ఆశాజనకంగా కనిపిస్తోంది. పంట సాగు చేసి రెండు నెలలు కావస్తోంది. మరో రెండు నెలల్లో దిగుబడులు వస్తాయి. దిగుబడులు అందే సమయానికి ధరలు బాగుంటే ఆదాయం వస్తుంది. సాగులో రూ.1.50 లక్ష మేర ఖర్చు పెట్టా. ధరలపైనే సాగులో వచ్చే ఆదాయం ఆధారపడి ఉంది.

- భాస్కర్ రెడ్డి, ఉల్లి రైతు, లింగాల మండలం



స్మారక సభలో మాట్లాడుతున్న రాష్ట్రపతి అవార్డు గ్రహీత గంగాధర్‌రెడ్డి

ఘనంగా పొన్నతోట గంగమ్మ వర్ధంతి


ప్రజాశక్తి - సింహాద్రిపురం

కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పొన్నతోట వెంకటరెడ్డి సతీమణి పొన్నతోట గంగమ్మ 19వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం అంకాళమ్మ గూడూరులో పొన్నతోట దంపతుల స్తూపం దగ్గర స్మారక సభను నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి అవార్డు గ్రహీత గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ కామ్రేడ్ పొన్నతోట వెంకటరెడ్డి దంపతులు స్వాతంత్రోద్యమంలో రైతులు, రైతు కూలీల కోసం అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పొన్నతోట సత్యప్రసాద్‌రెడ్డి, పొన్నతోట సరళ, గ్రామ ప్రజలు, దళిత నేతలు పాల్గొన్నారు.

ఉషాకిరణ్ పాఠశాల కరస్పాండెంట్‌కు పితృవియోగం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక ఉషాకిరణ్ పాఠశాల కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డి తండ్రి చిన్న మునిరెడ్డి (88) వయో భారంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పాఠశాల కరస్పాండెంట్ రమణారెడ్డి ఇంటికి వెళ్లి చిన్న మునిరెడ్డి భౌతికాయానికి శ్రద్ధాంజలి ఘటించారు. వేంపల్లెలో ఉన్న ఆయా పాఠశాలల కరస్పాండెంట్లతోపాటు పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు, జర్నలిస్టులు మునిరెడ్డి భౌతికాయానికి నివాళులర్పించి సానుభూతి తెలిపారు. టిడిపి, వైసిపి నాయకులు కూడా నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్న మునిరెడ్డికి తనకు చాలా అవినాభావ సంబంధాలు ఉన్నట్లు తులసిరెడ్డి పాత జ్ఞాపకాలను గుర్తు చేశారు. చిన్న మునిరెడ్డి ఆత్మకు శాంతి కలగాలని కోరారు. భౌతికాయానికి నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, నాగరాజు, అమర్నాథ్ రెడ్డి, వినయ్ పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న ఇఒ, చైర్మన్

అల్లాడుపల్లె దేవాలయ భజంత్రి శివయ్య మృతి

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లె దేవస్థానంలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న భజంత్రి శివయ్య అనారోగ్య కారణంతో ఆదివారం మృతి చెందాడు. ఆలయాన్ని మూసివేసినట్లు ఇఒ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆలయాన్ని శుద్ధి చేసి సంప్రోక్షణ తర్వాత ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభిస్తామని తెలిపారు. శివయ్య మృతి పట్ల చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్ సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి దహన సంస్కార ఖర్చులకు దేవస్థానం తరపున రూ.15వేలు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

స్థానిక బద్వేలు రోడ్డులోని దెయ్యాల సాధుసత్రంలో అనాథ సాధువు ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. పోలీస్ అధికారి వెంకటన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. పుణ్యక్షేత్రం ప్రాంతం కావడంతో వివిధ ప్రాంతాలు నుంచి బ్రహ్మంగారి మఠానికి వచ్చి పాడుబడ్డ సత్రాలలో సేదతీరుతుంటారు. భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తుంటారు. ఈ మధ్యకాలంలోనే దాదాపు నలుగురు అనాథలు మృతి చెందారు.




అంత్యక్రియలు నిర్వహిస్తున్న పంచాయతీ సిబ్బంది

అంధకారంలో ప్రధాన రహదారి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు నుంచి ముద్దనూరు వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న దీపాలు రాత్రి వేళల్లో వెలగలేదు. పెన్నానది వంతెనపై రెండు విద్యుత్ స్తంభాలు, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల నుంచి నానుబాల ఫంక్షన్ హాల్ వరకు విద్యుత్ దీపాలు వెలగకపోవడం వల్ల పాదచారులు, వాకింగ్ వెళ్లే వ్యక్తులు ఇబ్బందికి గురయ్యారు. రాత్రి సమయాల్లో వర్షాలకు విష పురుగులు తిరిగే అవకాశం ఉండడంతో మున్సిపల్ అధికారులు స్పందించి వాటిని సరి చేయాలని పలువురు కోరుతున్నారు.



రాత్రి 9 గంటల సమయంలో వెలగని వీధి దీపాలు



గండి అంజన్నను దర్శించుకున్న పలమనేరు ఎమ్మెల్యే

మూడవ శ్రావణ శనివారం రూ.25 లక్షలు ఆదాయం

ప్రజాశక్తి - చక్రాయపేట

శ్రావణమాస ఉత్సవాలు పురస్కరించుకుని పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి ఆదివారం ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారి జె.వెంకటసుబ్బయ్య, ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు కేసరి స్వామి, రాజ స్వామి ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. ముందుగా అంజన్న సన్నిధిలో వారి కుటుంబ సభ్యుల పేరుతో అర్చన, ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ మాస మూడవ శనివారం సందర్భంగా గండి ఆలయానికి రూ.25,73,543 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం చైర్మన్ కావలి కృష్ణతేజ, దేవస్థాన సహాయ కమిషనర్ జె.వెంకటసుబ్బయ్య తెలిపారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ వెంకటస్వామి, కావలి భానుకిరణ్ రాయల్‌పాల్గొన్నారు.

'ఉపాధి' నిధులతో సిమెంట్ రోడ్లు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద మంజూరైన నిధులతో సిమెంట్ రోడు వేస్తున్నారు. మండల కేంద్రమైన సింహాద్రిపురంతోపాటు పలు గ్రామాల్లో సిమెంట్ రోడ్లను నిర్మించారు. సింహాద్రిపురం ప్రభుత్వ కార్యాలయాలకు అనుసంధానంగా సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టారు. సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఉపాధి హామీ కార్యాలయం వద్దకు వెళ్లాలంటే ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారు. ఆయా కార్యాలయాలకు అనుసంధానంగా దాదాపు రెండు కిలోమీటర్ల మేర రూ1.25 కోట్ల నిధులతో సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేశారు. పోలీస్‌స్టేషన్ నుంచి ప్రభుత్వాసుపత్రి మీదుగా అంగన్వాడీ సెంటర్ వరకు ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఉపాధి నిధులతో సిమెంట్ రోడ్లను ఏర్పాటు చేశారు.

కార్యాలయాల వద్ద కొత్త శోభ..

ఉపాధి నిధులతో మండల కేంద్రంలోని ప్రధాన ప్రభుత్వ కార్యాల వద్ద సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేయడంతో కొత్త శోభ నెలకొంది. గతంలో వాహనదారులు, కార్యాలయ సిబ్బంది, ప్రజలు కార్యాలయంలోకి వెళ్లాలంటే పలు ఇబ్బందులు పడేవారు. రోడ్డు నిర్మాణంతో సిబ్బందికి, ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పంచాయతీరాజ్ శాఖ డిఇ సుధాకర్ రెడ్డి తెలిపారు.



ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే మార్గంలో వేస్తున్న సిమెంట్ రోడ్డు

విద్యాశాఖలో వింత ప్రయోగాలు మానుకోవాలి



జెండా వందనం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు పట్టణంలో ఉర్దూ ఉన్నత పాఠశాల వద్ద యూటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా సహాధ్యక్షుడు వై.రవికుమార్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 1974 ఆగస్టు 10న ఒక చారిత్రక నేపథ్యంలో స్థాపించబడి, విద్యారంగ, ఉద్యోగ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 117 జిఒ రద్దు చేస్తామని ప్రస్తుత కూటమి నాయకులు హామీ ఇచ్చారని, దాన్ని నిలబెట్టుకోవాలని, భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన తెలుగు రాష్ట్రంలో తెలుగు మాధ్యమం లేకపోవడం దారుణమని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల నాయకులు గంగులయ్య, రామకృష్ణ, తిరుపాలయ్య, రామ్ నాయక్ పాల్గొన్నారు.

సమరశీల పోరాటాలు యుటిఎఫ్‌కే సాధ్యం

ప్రజాశక్తి - బద్వేలు

రాజీలేని సమరశీల పోరాటాలు యుటిఎఫ్‌కే సాధ్యమని యుటిఎఫ్ కడప జిల్లా కార్యదర్శి టి.శివ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం యుటిఎఫ్ 52 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని బద్వేలులోని స్థానిక బాలుర ఉన్నత పాఠశాల వద్ద యుటిఎఫ్ పతాకాన్ని బద్వేలు మండల అధ్యక్షులు ఎస్.దేవానందం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి టి.శివ ప్రసాద్ మాట్లాడుతూ 1974 ఆగస్టు 10న ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాతలు అప్పారి వెంకటస్వామి, చెన్నుపాటి లక్ష్మయ్య, దాచూరి రామిరెడ్డి నేతృత్వంలో ఏర్పాటైన యుటిఎఫ్ నాటి నుంచి నేటి వరకు విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని సమరశీల పోరాటాలను నిర్వహిస్తున్నదన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే ధ్యేయంగా, ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు సి.కంచి రెడ్డి, ఎస్.మస్తాన్ వలి, ఎస్.బాలయ్య, ప్రసాద్, కె.మురళీ క్రిష్ణ, కొండయ్య , డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని పాల్గొన్నారు.

ఆదమరిస్తే.. అంతే సంగతులు..!

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పెన్నా నది వద్ద నుంచి జమ్మలమడుగు పట్టణంలోకి వచ్చే ప్రధాన రహదారిలో రెండు చోట్ల ప్రమాదాలు పొంచి ఉన్నాయి. వాహ నదారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదానికి గురి కావా ల్సిందే. పెన్నా నది వంతెన కంటే ముందు పైపుల ఫ్యాక్టరీకి ఎదురుగా రైస్ మిల్లు పక్కన ఇటీవల కురిసిన వర్షాలకు సైడ్ కాలువ సమీపంలో పెద్ద గుంత పడింది. కొందరు వ్యక్తులు గుంతపై ప్రమాదం జరగకుండా కంప వేశారు. ఈ నెల ఒకటో తేదీన సిఎం చంద్రబాబు జమ్మలమడుగు వస్తు న్నారని సభా వేదిక కోసం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాట్ల నిమిత్తం ముందుగా కొంత పని చేశారు. ఆ పనులలో భాగంగా వాహనాలు లేదా మనుషులు సభా వేదికకు వెళ్లేందుకు, రోడ్డు దాటేందుకు వీలుగా ప్రధాన రహదారి కంటే కొంత ఎత్తులో సైడ్ కాలువ ఉండడం వలన పగులు గొట్టారు. ముఖ్యమంత్రి సభా వేదిక ఆ ప్రదేశం నుంచి గూడెం చెరువుకు మార్చడంతో ఇక్కడ పగలకొట్టిన సైడ్ కాలువ అలాగే వది లే శారు. ప్రస్తుతం కడ్డీలతో దర్శనమిస్తోంది. ఇక్కడ ఏమాత్రం ఆదమరిసి మనుషులు, ద్విచక్ర వాహనాలు ఆ ప్రదేశంలో కింద పడితే ఇనుప కడ్డీలు గుచ్చుకోక తప్పదు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నత అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకమునుపే చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



రైస్ మిల్లు వద్ద సైడ్ కాలువ పక్కలో పడిన గుంత



సిఎం వస్తున్నారని పగులగొట్టిన సైడ్ కాలువ



సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పుట్టా

పేదలకు వరం సిఎం సహాయనిధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు నియోజవకవర్గ పరిధిలో సిఎం సహాయ నిధి కింద 20 మంది బాధితులకు ఆదివారం రూ.11.35 లక్షల చెక్కులను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పంపిణీ చేశారు. టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా అన్ని రకాల సేవలకు ఉచితంగా వైద్యం అందిస్తుందన్నారు. పథకం ద్వారా వైద్య సేవలు అందని వారు ఎవరైనా ఉంటే వారికి ఆర్థికంగా నష్టపోకుండా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం పేద ప్రజలను అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ వైస్ చైర్మన్ డి.గురివిరెడ్డి, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మునిశేఖర్ రెడ్డి, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



అందుబాటులోకి సెంట్రల్ ఎసి ఫంక్షన్ హాల్

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల పట్టణంలో నూతనంగా సెంట్రల్ ఎసి ఫంక్షన్ హాల్ (బికేఆర్ ఫంక్షన్ హాల్) అందుబాటులోకి రానుందని యజమాని బోయపల్లె వెంకట రవికుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ విడిది ఏర్పాటుకు విశ్రాంతి ఇచ్చేందుకు విశాలమైన లగ్జరీ అనుభూతి పొందే 24 ప్రత్యేక గదులు ఉన్నాయని తెలిపారు. వేలాదిమంది భోజనాల చేసేందుకు సువిశాలమైన పెద్ద భోజన శాల నిర్మించామన్నారు. ముఖ్యంగా సెంట్రల్ ఎసితో విశాలమైన ఫంక్షన్ హాల్, అందులో విశాలమైన స్టేజీ ఏర్పాటు చేశామని తెలిపారు. అధునాతన సౌకర్యాలతో ఈ ఫంక్షన్ హాల్ నిర్మించామని తెలిపారు. సుమారు 500 వాహనాలకు మించి నిలుపుకునే పార్కింగ్ సౌకర్యం ఉందన్నారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి బుకింగ్ చేసుకోవచ్చునని తెలిపారు. మధ్యతరగతి వారికి కూడా అందుబాటు బాడుగతో పట్టణానికి సమీపంలో ప్రొద్దుటూరు బైపాస్ రోడ్డులో ప్రత్యేక వసతులతో ఈ ఫంక్షన్ హాల్ నిర్మించామన్నారు. అన్ని హంగులతో ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులు చేయించామని తెలిపారు. వివాహాలకు, శుభకార్యాలకు అవసరం ఉన్నవారు ఫంక్షన్ హాల్ వద్దకు వచ్చి చూసుకొని బుక్ చేసుకోవాలన్నారు. వివరాలకు 98855 12369, 95028 37955, మేనేజర్ 83095 79300 సెల్ నెంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

ఉప ఎన్నికల్లో రెండు పార్టీలు డబ్బు పంపిణీ

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

పులివెందుల జడ్‌పిటిసి ఉప ఎన్నికలో ఓటర్లను డబ్బుతో ప్రలోభపెడుతున్నారని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి ఆరోపించారు. స్థానికంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ టిడిపి, వైసిపి యథేచ్ఛగా డబ్బు పంపిణీ చేస్తున్నాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో ప్రజాస్వామ్యం నానాటికి తీసికట్టు నాగంభట్లు అన్నట్లు తయారైందని విమర్శించారు. ప్రజాస్వామ్యం నేతి బీరకాయలా తయారైందని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడంలో వైసిపి, టిడిపి దొందూదొందే అన్నారు. ప్రస్తుతం కడప జిల్లాలో జరుగుతున్న పులివెందుల, ఒంటిమిట్ట జడ్‌పిటిసి ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యం స్థానంలో ధనస్వామ్యం వీర విహారం చేస్తోందన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. టిడిపి, వైసిపి వ్యవహారాన్ని ప్రజాస్వామ్యం అనడం సిగ్గుచేటన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఇర్ఫాన్‌బాషా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వందల సంఖ్యలో ఆరోగ్య పరీక్షలను ఉచితంగా చేయించుకున్నారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఇర్ఫాన్ బాషా మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడం తనకు ఎంతో సంతోషా న్నిస్తోందన్నారు. రాబోవు రోజుల్లో నియోజకవర్గ స్థాయిలో మరిన్ని సేవా కార్యక్రమాలతో ప్రజలకు దగ్గర అవుతామని తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన హెూలిస్టిక్ ఆసుపత్రి డాక్టర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జాతీయస్థాయిలో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు కేవలం కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు.



ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్న వృద్ధుడు

ప్రభుత్వాసుపత్రికి దారేదీ..!

- దుకాణాలు, ఆటోలతో మూసుకుపోయిన దారి..108 వెళ్లడానికి కూడా కష్టమే

ప్రజాశక్తి - చక్రాయపేట

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి. అనారోగ్యంతో రోగులు బాధపడుతూ వైద్యులను సంప్రదించాలంటే దారి కనిపించడంలేదు. మండలంలోని సురభి గ్రామం నాగలగట్టుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిస్థితి ఇది. రాయచోటి-వేంపల్లి మధ్యలో ఎన్‌హెచ్ 440 రోడ్డు సవరణలో భాగంగా ఆస్పత్రి ప్రహరీని తొలగించారు. రోడ్డు పక్కన ఉన్న చిరు వ్యాపారస్తులు, వాహనాలు, ఆటోలు ఆస్పత్రి ముందు భాగంలో పెట్టడంతో మారుమూల ప్రాంతాల నుండి వ్యాధిగ్రస్తులను ఆటోలో, జీపులో కానీ ఆసుపత్రి లోపలికి వెళ్లాలంటే దారి లేకుండా పూర్తిగా మూసుకుపోయింది. అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్ వాహనం కూడా ఆసుపత్రి లోపలికి వెళ్లాలంటే దారి లేదు. ఉన్న ప్రహరీ రోడ్డు సవరణలో తొలగించారు. రోడ్డు సవరణ చేసినా ఆర్‌అండ్‌బి అధికారులు ప్రహరీ నిర్మించకపోవడంతో ప్రభుత్వాసుపత్రికి రోగులు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్యను ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదని వైద్య సిబ్బంది లబోదిబోమంటున్నారు. ఆసుపత్రికి ముందు భాగంలో ఉన్న చిరు వ్యాపారులు, ఆటోలు తొలగించాలని చెప్పలేని స్థితిలో ఉన్నామని వైద్య సిబ్బంది పేర్కొంటున్నారు. సంబంధిత రోడ్డు అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రభుత్వ ఆసుపత్రికి ప్రహరీ నిర్మించాలని కోరుతున్నారు. 108 అంబులెన్స్ వాహనం వెళ్లడానికి పెద్ద గేటు పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు సూచిస్తున్నారు.



నాగలగట్టుపల్లె ప్రభుత్వాసుపత్రికి మూసుకుపోయిన దారి